గుట్టలో వైభవంగా సుప్రభాత సేవ

యాదగిరిగుట్ట, డిసెంబర్ 7 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామికి సుప్రభాత సేవ గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో 'కౌసల్యా సుప్రజా రామపూర్వ సంధ్యా ప్రవర్తతే' అంటూ స్థాన సుప్రభాతాన్ని ఆలకించి స్వామిని మేల్కొల్పారు. స్వామికి తిరువారాధన, బాలబోగం, నిజాభిషేకం, నివేదన, నిత్యబలి ప్రదానం మంగళశాసనంతో ప్రాబోధిక కార్యక్రమాన్ని ముగింపు పలికి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం చేశారు. నిజరూప దర్శనంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శ నారసింహ హోమం నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరు కల్యాణోత్సవం ఘనంగా జరిపించారు. అనంతరం లక్ష్మీ సమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్యతిరు కల్యాణ తంతు జరిపించారు. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి నిత్యకల్యాణ తంతును జరిపించారు. కల్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణ తంతు వీక్షించారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులకు సువర్ణ పుష్పార్చనలు చేశారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం ముఖ మండపంలో స్వామివారికి దివ్య మనోహరంగా అలంకరించి ఆస్థానంపై వేంచేపు చేశారు. నాలుగు వేదాలు స్వామివారికి పారాయణం చేసి, స్వామివారి స్వస్తి మంత్రార్థ వంటి మంత్రాలతో శాంతిపజేశారు. అనంతరం స్వామిని గర్భాలయంలో వేంచేపు చేశారు. ఉత్సవమూర్తికి ఉభయ జోడు సేవలు నిర్వహిస్తారు. భక్తులు కోరిన వాహనంపై స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసిన జోడు సేవలను తిరువీధిలో ఊరేగించారు. సాయంకాలం ఆరాధన చేపట్టి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు పవళింపు సేవ నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ద్వార బంధనం కార్యక్రమాన్ని చేపట్టి ఆలయాన్ని మూసివేశారు. కార్తీక మాసం సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు, దీపారాధనలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి వారి దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలు కలుపుకొని స్వామివారికి రూ. 20,77,049 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి తెలిపారు.

యాదగిరిగుట్టలో లక్ష్మీనర్సింహుల నిత్య తిరుకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరీశుడి హుండీల ఆదాయం రూ.2.38కోట్లు

యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ స్వామి 28రోజుల హుండీల ఆదాయం రెండుకోట్లు దాటిందని ఆలయ ఈఓ ఎన్.గీత తెలిపారు. కొండ కింద వ్రత మండపంలో గురువారం హుండీలను లెక్కించగా నగదు రూ.2,38,46,282 ఆదాయం వచ్చిందని తెలిపారు. మిశ్రమ బంగారం 90గ్రాములు, మిశ్రమ వెండి 3కిలోల 740 గ్రాములు వచ్చిందని తెలిపారు. వీటితో పాటు 748అమెరికా డాలర్లు, 670 యూఏఈ థిరామ్స్, 80 సింగపూర్ డాలర్లు, 40 ఆస్ట్రేలియా డాలర్లు, 1 ఖతర్ రియాల్, 1,012 మలేషియా నేగరతో పాటు వివిధ దేశాలకు చెందిన కరెన్సీ సమకూరిందని ఈఓ తెలిపారు.

సీతారామచంద్రస్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

- సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్, డిసెంబర్ 7 : దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తున్నదని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. మండలంలోని మాచారంలో ఇటీవల నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆయన విచ్చేసి దేవతా మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లక సైదమ్మాబొబ్బయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జడ్పీటీసీ మామిడి అనితాఅంజయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంగరి యుగంధర్, జిల్లా నాయకులు మామిడి అంజయ్య, అనిరెడ్డి వెంకటరెడ్డి, బొల్లక బొబ్బయ్య, బిట్టు నాగేశ్వర్‌రావు, జూలకంటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- కలెక్టర్ హనుమంతుకే జెండగే

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 7 : ఈ నెల చివరిలోగా 2022-23 వానాకాలం సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతుకే జెండగే రైస్ మిల్లర్లను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రైస్‌మిల్లుల యజమానులతో సమావేశమై 2022-23 వానాకాలం కస్టమ్ మిల్లింగ్ రైస్ పనులకు సంబంధించి లక్ష్యాలు పూర్తి కాని మిల్లర్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 44 మిల్లుల ద్వారా 1.91లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యానికి 1.65లక్షల మెట్రిక్ టన్నులు (84శాతం) సీఎంఆర్ పూర్తైందన్నారు. ఈ నెల చివరిలోగా వందశాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించారు. ప్రస్తుత వానాకాలం ధాన్యం కొనుగోళ్లు వారంలోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు 2.44లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 20,800మంది రైతుల ఖాతాలో రూ.430కోట్లు జమ చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్‌రావు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గోపీకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ కోశాధికారి వెంకటేశ్, మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

జలాల్‌పురం రైతుకు జాతీయ అవార్డు

ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న బిచ్చు

గరిడేపల్లి, డిసెంబర్ 7 : వినూత్న పంటలు సాగు చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్న తిరుమలగిరి మండలంలోని జలాల్‌పురం గ్రామ రైతు భూక్యా బిచ్చు జాతీయ మిలియనీర్ రైతు అవార్డు-2023 సాధించినట్లు గడ్డిపల్లి కేవీకే ఇన్‌చార్జి పీసీ దొంగరి నరేశ్ తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ అవార్డుకు రాష్ట్రం నుంచి నలుగురు రైతులు ఎంపిక కాగా అందులో బిచ్చు ఒకరన్నారు. పదేండ్లుగా సాగులో నూతనంగా వచ్చే మార్పులను అవగతం చేసుకుంటూ కేవీకే ఉద్యానవన శాస్త్రవేత్త సీహెచ్.నరేశ్ ప్రోత్సాహంతో పాలిహౌస్ సాంకేతికతను ఉపయోగిస్తూ చామంతి పూలు సాగు చేయడంతో పాటు మిరప, కూరగాయలు, పత్తి, వరి తదితర పంటలను సాగు చేస్తున్నారన్నారు. వాతావరణ పరిస్థితులతో పంట దిగుబడులు రాక నష్టపోయిన చోట దోస, బెండ వంటి పంట మార్పిడితో అధిక లాభాలు గడిస్తున్నట్లు తెలిపారు. బిచ్చు పండించిన దిగుబడులను హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. అయితే బిచ్చు వినూత్న సాగు, మార్కెంటింగ్ అంశాలను పరిగణలోకి తీసుకున్న ఐసీఏఆర్ ఉత్తమ రైతు అవార్డును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఢిల్లీలో అవార్డును అందుకున్న బిచ్చును గడ్డిపల్లి కేవీకే సెక్రటరీ డాక్టర్ ఎం.స్నేహలత, డైరెక్టర్లు, శాస్త్రవేత్తలు అభినందించారు.

నేటి నుంచి అర్వపల్లి ఉర్సు

- రెండు రోజులు జరుగనున్న హజ్రత్ ఖాజా నసీరుద్దీన్ బాబా ఉత్సవాలు
- అన్ని ఏర్పాట్లు చేసిన దర్గా నిర్వాహకులు

అర్వపల్లి, డిసెంబర్ 7 : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన అర్వపల్లిలోని హజ్రత్ ఖాజా నసిరుద్దీన్ బాబా ఉర్సు ఉత్సవాలు నేటి నుంచి రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. 8న శుక్రవారం సాయంత్రం అర్వపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి గంధాన్ని మండల ప్రజాప్రతినిధులు ఊరేగింపుగా తీసుకొస్తారు. అదే రోజు రాత్రి ఖవ్వాలి నిర్వహిస్తారు. 9న శనివారం దీపారాధన కార్యక్రమాలు నిర్వహణతో ఉర్సు ఉత్సవాలు ముగుస్తాయి. వివిధ రోగాలతో ఇబ్బంది పడుతున్న వారు, మానసిక ప్రశాంతత లేని వారు ప్రతి శుక్రవారం దర్గా గద్దెపై నిద్రిస్తుంటారు. అలాగే కందూరు పండుగలతో పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. దర్గా సమీపంలో చెలిమె బావి ఉంది. 4ఫీట్ల వెడల్పుతో 150అడుగుల లోతు ఉంటుంది. ఎంత ఎండకాలం లోనూ చెలిమె బావిలో నీరు ఉండడం విశేషం. ఈ నీళ్లతో స్నానం చేయడంతో పాటు తాగితే సర్వ రోగాలు పోతాయని నమ్మకంతో భక్తులు సీసాలో ఇంటికి తీసుకెళ్తుంటారు. దర్గాను పూర్తిగా రాతితో నిర్మించడంతో అన్ని కాలాల్లోనూ చల్లగా ఉండడం ఈ దర్గా ప్రత్యేకత. ఇప్పటికే దర్గాకు రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు ముజావర్ సయ్యద్ అలీ తెలిపారు.

దర్గాలో బాబా సమాధి

నేడు ఎంజీయూలో క్రాస్ కంట్రీ పోటీలు

రామగిరి, డిసెంబర్ 7: మహాత్మా గాంధీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐయూటీ క్రీడాల్లో భాగంగా ఈనెల 8న క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని కళాశాలల విద్యార్థులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హైకోర్టులోని వివిధ పోస్టులకు 10న కంప్యూటర్ నైపుణ్య పరీక్ష

నీలగిరి, డిసెంబర్ 7 : రాష్ట్ర హైకోర్టు సర్వీస్‌లో కంప్యూటర్ ఆపరేటర్, తెలంగాణ జ్యూడీషియల్ మినిస్టీరియల్ సర్వీస్ కింద టైపిస్ట్, కాపీయిస్ట్ పోస్టుల భర్తీకి ఈ నెల 10న కంప్యూటర్ ఆధారిత నైపుణ్య పరీక్షను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఆండ్ సెషన్స్ జడ్జి ఎం.నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను మూడు షిఫ్టులలో డెసిబుల్ మేనేజ్ మెంట్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఎస్‌పీఆర్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో డీఈఓ భిక్షపతి

ముగిసిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

- జాతీయ స్థాయి పోటీలకు 45మంది ఎంపిక

నల్లగొండ రూరల్, డిసెంబర్ 7 : పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికల కరాటే పోటీలు గురువారం ముగిశాయి. క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి డీఈఓ భిక్షపతి హాజరై జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విజేతలకు మెడల్స్ అందించారు. జాతీయ స్థాయికి ఎంపికైన 45మంది క్రీడకారులు ఢిల్లీలో ఈ నెల 16నుంచి జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు అండర్ -14కు బాలురు 10మంది, బాలికలు 11మంది, అండర్ -17 బాలురు 13మంది, బాలికలు 11మంది ఎంపికైనట్లు తెలిపారు. వీరిలో వెయిట్ కేటగిరి ప్రకారంగా ఒక్కో వెయిట్‌కు ఒక క్రీడాకారుడు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వాసుదేవరావు, యోగా అసోసియేషన్ కార్యదర్శి కుంభం నర్సిరెడ్డి, నర్సింహాచారి, పీఈటీలు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.